క్లుప్తంగా

విద్యతో ఉన్నత స్థితి



తెనాలిఅర్బన్: విద్యతో ఉన్నతస్థితికి చేరుకో వచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ మురుగుడు శ్రీహరి పేర్కొన్నారు. పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముత్తెంశెట్టిపాలెంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం 142 మంది విద్యార్థులకు రూ.2.84 లక్షల విలువ చేసే నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో మారుతున్న విద్య విధానానికి అనుగుణంగా అందరూ మారాల్సిన అవసరం ఉందన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. జొన్నాదుల నరసింహారావు, ఆదినారాయణ, గంజి ప్రభాకరరావు, దివి పురుషోత్తం, కటకం శేషగిరి, బట్టు నరేంద్రబాబు, పంచుమర్తి భాస్కరరావు, దివి హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు యూనిఫాం పంపిణీ

తెనాలిఅర్బన్: రావినూతన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో రావినూతల వెంకుబాయమ్మ, కామేశ్వరమ్మ స్మారక మెమోరియల్ ట్రస్ట్, రోహిణి హాస్పటల్‌ల సంయుక్త సహకారంతో వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో సోమవారం ఇంటర్ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 65 మంది విద్యార్థినులకు వీటిని పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథులుగా చందోలు శంకరరావు, మాజీ జడ్పీటీసీ డాక్టర్ పృథ్వీలత, డాక్టర్ యామిని, దివ్య, రావినూతల ప్రకాష్, అన్నపూర్ణ, తదితరులు పాల్గొంటారని చెప్పారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



తెనాలి: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ పార్వతిదేవి సమేత శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవస్థానంలో ఈఓ హరిప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకుడు స్వర్ణ వెంకట నాగకుమార్ శర్మ పర్యవేక్షణలో ఆదివారం భక్తులు అమ్మవారికి ఆషాఢమాస సారెను సమర్పించారు. స్థానిక లక్ష్మీనగర్, రెడ్ల బజార్ కు చెందిన ప్రజలు, భక్తులు, అన్నదాన కమిటీ సభ్యులు గోపిశెట్టి నాగేశ్వరావు ఇంటి నుంచి బయలుదేరి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పూజలు జరిపి సారెను సమర్పించారు. ఈఓ హరిప్రసాద్ మాట్లాడుతూ గత 40 రోజుల క్రితం ఎంతో వైభవంగా ప్రతిష్ఠ చేసుకున్న శ్రీ పార్వతి దేవి సమేత ఓంకారేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా భక్తులు సారె సమర్పించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ స్వామి, అమ్మవారు ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. దేవదాయ శాఖ ఈఓ అవుతు శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్మికులపై కక్ష సాధింపు తగదు

లక్ష్మీపురం: శాంతియుతంగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం తగదని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌కు 2025 జూన్ 12న సమ్మె నోటీసు ఇచ్చామని వివరించారు. చట్ట ప్రకారం సమ్మె నోటీసు ఇచ్చి సమ్మె చేస్తున్న కార్మికులను భయభ్రాంతులకు గురిచేసేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ షోకాజు నోటీసులు ఇవ్వటం సరైన చర్య కాదన్నారు. షోకాజ్ నోటీసులు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ

నగరంపాలెం: వయో వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహాయం అందించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వయో వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో కూలీ పనులు చేయలేక ఎందరో అర్ధాకలితో జీవిస్తున్నారని అన్నారు. అటువంటి వారికి తమ వంతుగా చేయూతను అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పాలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎస్వీ రమణ, పల్లం పాటిర జనీశ్వరరావు, పలకలూరి శివరావు, మామిడి వెంకటశ్రావణ్ పాల్గొన్నారు.

సేవతోనే శాంతియుత జీవనం

- మానవత, తెనాలి ద్వితీయ వార్షికోత్సవంలో వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి
- డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం
- నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

తెనాలి: సేవతోనే సమాజంలోనే శాంతియుత జీవనం నెలకొంటుందని ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ మానవత వ్యవస్థాపకుడు, కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. మేధావులు సమాజం బాగోలేదని పెదవి విరవటం కన్నా అందరితో కలిసి సేవతో ముందుకు కదిలినపుడు శాంతి నెలకొనటం కష్టమేం కాదన్నారు. పవిత్రమైన సేవలో పాల్గొంటే మానసిక సంతృప్తి కలిగి, ఆయుఃప్రమాణం పెరుగుతుందనీ, అందుకు మానవత సంస్థ ఒక వేదికగా నిలుస్తుందని భావిస్తున్నట్టు చెప్పారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కుమార్‌పంప్స్ సత్సంగ హాలులో ఆదివారం జరిగిన మానవత, తెనాలిశాఖ ద్వితీయ వార్షికోత్సవానికి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైరుధ్యాలు, ఘర్షణలు నెలకొన్న సమాజంలో సేవ ఆవశ్యకతను వివరించారు. మనుషుల మధ్య ప్రేమసంబంధాలు నెలకొల్పితే లోకమే శాంతినికేతనం అవుతుందన్నారు. సంస్థ కేంద్ర కమిటి డైరెక్టర్ ఎ.రామాంజులరెడ్డి తన ప్రసంగంలో రాష్ట్రంలో 132 శాఖలు, 82 వేలకు పైగా సభ్యులతో 'మానవత' నడిచేందుకు కారణం రామచంద్రారెడ్డి సంకల్పం, ఆశయం గొప్పవి కావటమేనని చెప్పారు.

సేవకు వ్యక్తిగత భేషజాలుండవు

రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సేవకు వ్యక్తిగత భేషజాలుండవనీ, సద్వినియోగం అయితే ఎంతైనా వెచ్చిందేందుకు ముందుకొచ్చే దాతలు ఉన్నారని చెప్పారు. అమృతసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి కుదరవల్లి రామమోహనరావు తన ప్రసంగంలో విద్య, వైద్యం, ఆరోగ్యం అందరికీ అందిననాడు సమాజం శాంతియుతంగా ఉంటుందన్న మానవత ఆశయంలో భాగస్వామి కావటం సంతోషంగా ఉందన్నారు. మానవత గుంటూరు చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మానవత శాఖల్లో తెనాలి ఆదర్శంగా ఉందన్నారు. తెనాలిశాఖ గౌరవ సలహాదారు మొవ్వా సత్యనారాయణ సేవా ఆవశ్యకతను తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ సరీ్వసెస్‌లో అడిషనల్ డైరెక్టర్‌గా రిటైరైన 'పేదల డాక్టర్' డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి పి.వెంకట్ పర్యవేక్షించారు. అనంతరం 2025–26 సంవత్సరానికి నూతన కార్యవర్గ అధ్యక్షుడుగా పరిమి శ్రీనివాసరావు (వాసు), కార్యదర్శిగా పాపోలు వెంకటేశ్వరరావు (వెంకట్), కోశాధికారిగా ఎస్వీ శర్మ, ఉపాధ్యక్షుడిగా కటకం వెంకట ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా డీవీ సోమయ్యశాస్త్రి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కూరపాటి కళ్యాణ్ ప్రమాణస్వీకారం చేశారు. తొలుత వెంపటి సత్యనారాయణ గానం, అయినాల మల్లేశ్వరరావు వ్యాఖ్యానంతో సినీసంగీత విభావరి, శ్రీలక్ష్మీకూచిపూడి నృత్యకళాకేంద్రం నృత్యగురువు ఎ.వెంకటలక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి.

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు కేవీపీఎస్ మద్దతు

తెనాలి: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సంపూర్ణ మద్దతును ప్రకటించింది. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కేటగిరీల నిర్ణయంలో జరిగిన పొరబాట్లను సరిదిద్దాలని 36 జీఓ ప్రకారం జీతాలు పెంచాలని, తల్లికి వందనంతో సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలు షరతులు లేకుండా మున్సిపల్ కార్మికులందరికీ వర్తింపజేయాలని, తదితర కోర్కెలను పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఒ.నల్లప్ప, ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత 10 నెలలుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించి తమ కుటుంబాలను పస్తుల నుంచి కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారని గుర్తుచేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్మిక సంఘాలతో సంయుక్త సమావేశాల పేరిట కాలయాపన చేయడం, మరో వైపు కరెంటు చార్జీల భారాన్ని మోపడం, సంక్షేమ పథకాల అమలుకు నిరాకరించడంతో కార్మికులు దీర్ఘకాలికంగా ఆందోళనలు నిర్వహిస్తూ వచ్చినట్టు తెలిపారు. రెండు నెలల క్రితమే సమ్మె నోటీసులిచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యం వహించడాన్ని కేవీపీఎస్ ఖండిస్తోందని తెలిపారు. జూలై 12వ తేదీ అర్ధరాత్రి నుంచి ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించినప్పటికీ ప్రభుత్వం కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటుచేసి చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించేందుకు పూనుకోకుండా జీతాల పెంపునకు ప్రభుత్వం సానుకూలంగా ఉందంటూ మున్సిపల్ శాఖామంత్రి మీడియాకు మెసేజ్ ఇవ్వడం కార్మికుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికసంఘాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించడం, సమ్మెను నివారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

క్లబ్‌ల సేవా కార్యక్రమాలు విస్తృతం



నగరంపాలెం: వాసవి క్లబ్ తరుపున సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని వాసవి క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ అన్నారు. వాసవి క్లబ్ గుంటూరు, మహిళా గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆర్.అగ్రహారం గీతా మందిరంలో 108 మంది వృద్ధులకు ఉచిత బియ్యం, పెన్షన్లు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ ఫండ్ రైజింగ్ కమిటి చైర్మన్ పొదర్తి దుర్గారావు మాట్లాడుతూ క్లబ్‌లు నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాయని అన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కమిటి చైర్మన్ కొల్లిపర దుర్గానాగమణి, క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖరరావు, కోశాధికారి వేమూరి ప్రదీప్‌కుమార్, మున్నలూరి గౌరీశంకర్, కొర్లక వెంకటేశ్వరరావు, గుండా హరిప్రసాద్ అమరా రమేష్, దివ్వెల కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మంగళగిరి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెను ప్రారంభించారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ఆదివారం సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సమ్మెలోకి కార్మికులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సమ్మె కాలపు ఒప్పందాలను జీవోలు జారీ చేయాలని అన్నారు. సమ్మెకు మద్దతుగా ఎయిమ్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.శ్రీనివాసరావు, కె.బుజ్జి పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.బాలాజీ, వీవీ జవహర్‌లాల్, పల్లె కృష్ణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు



1998లో తెనాలిలో 'కోట'కు గోవిందరాజుల సుబ్బారావు అవార్డు ప్రదానం (ఫైల్)



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: తెలుగు సినీ రంగంలో ఒక విలక్షణ నటుడిగా నటించిన ప్రతి పాత్రకు జీవం పోసిన మహానటుడు కోట శ్రీనివాసరావు మరణం సినీ రంగానికే కాక తెలుగు ప్రజలకు కూడా విచారకరమని స్వరలయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు లక్కరాజు సాయి అన్నారు. మారీసుపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కోట శ్రీనివాసరావుతో తన కున్న అనుబంధాన్ని సాయి గుర్తుచేసుకున్నారు. 1998లో సామాజిక సాంస్కృతిక సేవాసంస్థ 'స్పందన' తరఫున ప్రముఖ నటుడు గోవిందరాజుల సుబ్బారావు స్మారక అవార్డును కోట శ్రీనివాసరావుకు ప్రదానం చేసినట్టు ఆ కార్యక్రమ జ్ఞాపకాలను వెల్లడించారు. కోట తనకు రాసిన ఉత్తరం, ఆనాటి ఫొటోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నటులు హేమంత్, రమణయ్యలు ఉన్నారు.

మా–ఏపీ కార్యాలయంలో నివాళి ..

తెనాలి: తెలుగు సినిమారంగంలో 750 సినిమాల్లో నటించిన ప్రముఖ నటుడు ప్రత్యేకత మరెవ్వరికీ లేదని, ఆయన సినీడైలాగులు తెలుగునాట ప్రతి నోటా సజీవంగా ఉంటాయని మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. స్థానిక మా–ఏపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సినీ నటుడు కోట శ్రీనివాసరావు సంతాపసభ నిర్వహించారు. అక్కడే మీడియాతో మాట్లాడారు. కోట శ్రీనివాసరావు, ఎస్వీ రంగారావు వంటి నటులు తమ నటనతో తెలుగుప్రజల హృదయాల్లో నిలిచిపోయారని చెప్పారు. వెంకటేష్ హీరోగా నటించిన గణేష్ చిత్రంలోని ఆఖరి సన్నివేశంలో కోట నటన అత్యద్భుతమని గుర్తుచేశారు. అలాంటి గొప్ప నటులకు పద్మశ్రీ వంటి ప్రభుత్వ పురస్కారాలు రాకపోవటం దురదృష్టకమన్నారు. భారత ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకుని కోట శ్రీనివాసరావుకు మరణం తర్వాతనైనా సముచిత అవార్డును ప్రకటించాలని విజ్ఞప్తిచేశారు. మా–ఏపీ సభ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, కారుమూరు శివరామిరెడ్డి, రాబర్ట్, కొల్లూరు సామ్రాజ్యం, తన్నీరు రమణ, బసవరత్న, చినరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ఛానల్ మరమ్మతు పనులు



ఛానల్‌ను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

పెదకాకాని: నిత్యం లక్షల మందికి మంచినీరు, పంట పొలాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్(కొత్త కాలువ)లో గుర్రపు డెక్క తొలగింపు, కాలువ గట్ల మరమ్మతుల పనులు అసంపూర్తిగా జరుగుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. రైతులతో కలిసి పెదకాకాని శివారులోని గోళ్లమూడి రోడ్డులో గల గుంటూరు ఛానల్‌ను ఆయన రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. కాలువలో తూడికాడ తొలగింపునకు గడ్డి నివారణ మందు పిచికారీ చేయడంతో ఛానల్‌లో నీరు విషపూరితంగా మారిందన్నారు. గుర్రపుడెక్క, తూటికాడ నీటిలో కుళ్లిన తరువాత మొక్కుబడిగా ప్రొక్లెయిన్ సాయంతో తొలగింపు చర్యలు చేపట్టారన్నారు. పనులు పూర్తి అయిన ప్రదేశంలో ఇంకా కుప్పలు కుప్పలుగా కుళ్లిన తూటికాడ కాలువలో మిగిలిపోయిందన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు సంకూరి నీలాంబరం, రైతులు వి.వీరాంజనేయులు, డి.వినోద్ బాబు, డి.భవానిశంకర్, జి.నాగరాజు, ఎస్ గోపి, డి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య సేవలను వినియోగించుకోవాలి

పెదకాకాని: ఉచిత ఆయుర్వేద వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి అన్నారు. మండలంలోని వెనిగండ్ల బొడ్డురాయి సెంటర్‌లో ఆదివారం శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచి వేల్పుల శ్రావణి మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్యం చాలా పురాతన కాలం నుండి మంచి ప్రాచుర్యం పొందిందన్నారు. ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్య నిపుణులు, చైర్మన్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆయుర్వేద పంచకర్మ వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేకుండా అగతవరప్పాడు సమీపంలో అన్ని సౌకర్యాలతో 100 పడకల ఆసుపత్రి స్థాపించామన్నారు. శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచి కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, వేల్పుల నాగరాజు, మాకిరెడ్డి వెంకటరెడ్డి, వైద్య బృందం పాల్గొన్నారు.

స్టాంపింగ్ ధరల పెంపుపై అవగాహన



నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తూనికలు, కొలతలు శాఖ(లీగల్ మెట్రాలజీ) ఆధ్వర్యంలో పరికాల స్టాంపింగ్ రేట్లు పెంచడం జరిగిందని, దీనిపై అవగాహన కలిగి ఉండాలని ఆ శాఖ డెప్యూటీ కంట్రోలర్ బి.వెంకట హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఆ శాఖ కార్యాలయంలో కాటాలు, వెయింగ్ మిషన్ల రిపేరర్లు, మ్యానుఫ్యాక్చరర్లు, డీలర్లుతో ఫీజులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పెరిగిన ఫీజులకు అనుగుణంగా వ్యాపారస్తులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్.అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢ బోనాలు



బోనాలు సమర్పిస్తున్న మహిళలు

రూరల్ మండలం కఠెవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. కనక తప్పెట్లు, మేళతాళాలు, దుర్గాదేవి వేషధారణలతో గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ అర్చకులు జాజుల జగదీష్, గురుభవానీ జాజుల వెంకటేశ్వరరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

– తెనాలిటౌన్

కులం పేరిట దూషించినందునే బలవన్మరణం

- ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తిని అరెస్టు చేయాలి
- దావులూరు అడ్డరోడ్డు వద్ద దుర్గాప్రసాద్ మృతదేహంతో కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

కొల్లిపర: దళిత యువకుడి ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తి గాయం శివారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలంటూ ఆదివారం మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద పెరికల దుర్గాప్రసాద్ మృతదేహంతో కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శివారెడ్డి కులం పేరుతో దూషించాడనే కారణంగానే దుర్గాప్రసాద్ శనివారం పురుగు మందు తాగి మృతి చెందాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎస్సీ నాయకులైన మారుమూడి విక్టర్ ప్రసాద్, యండ్రపాటి అశోక్‌కుమార్ లతో మాట్లాడారు. ఇప్పటికే శివారెడ్డిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని, కుటుంబ సభ్యులను తగిన న్యాయం చేస్తామని పోలీసులు చెప్పడంతో దళిత సంఘ నాయకులు నిరసనను విరమించారు.

ఎన్నిసార్లు చెప్పినా మార్పురాదా?

మున్సిపల్ అధికారులతో మంత్రి నాదెండ్ల మనోహర్



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: తెనాలి చినరావూరులో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. కాల్వలన్నీ వ్యర్థాలతో నిండి ఉన్నాయి. ప్రతిరోజు వీటిని బాగు చేయటంలేదా అంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల నుంచి ఆకస్మిక పర్యటన చేశారు. చినరావూరు పార్కు నుంచి ప్రారంభమైన పర్యటన చినరావూరు రైల్వే స్టేషన్ సమీపం నుంచి వాటర్ ట్యాంక్ రోడ్డు మీదుగా దేవి చౌక్ వరకు కొనసాగింది. పలువీధులలో చెత్త రోడ్లపై కన్పించటం ఆయన పర్యటిస్తున్న సమయంలో వాటిని తొలగించడాన్ని గమనించిన ఆయన ఇలాంటి హడావిడీ పనులు చేయవద్దని సూచించారు. అలాగే ఆయన వెళ్లే రోడ్లలో కార్మికులు హడావిడిగా కాల్వలు బాగు చేయటం కన్పించటంతో ఈ పద్ధతి మార్చుకోవాలని మందలించారు. డిపో రోడ్డులో కాల్వలు వ్యర్థాలతో నిండి పారుదల లేకపోవడాన్ని గమనించిన ఆయన మీ పనితీరు చూస్తేంటే బాధేస్తుందని, ఎన్నిసార్లు చెబుతున్న మీలో మార్పు రావటం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. కార్మికులు వార్డులలో పనిచేసేందుకు రావటం లేదని, దీనివల్ల వార్డులలో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయని 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు మంత్రికి తెలిపారు. కార్మికుల అటెండెన్స్, రోజువారీ కూలిల ఏర్పాటుపై ఆడిట్ చేయాలని ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబును ఆదేశించారు. అనంతరం కార్మికుల అటెండెన్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, కౌన్సిలర్ కుర్రా సుజాత, ఎంపీటీసీ అమ్మిశెట్టి హరికృష్ణ, టీపీఓ సాంబశివరావు, జనసేన పార్టీ నాయకులు హరిదాసు గౌరిశంకర్, బంగారు రవి కాంత్, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అడివి బాపిరాజు రచనా శైలి ప్రత్యేకం

- పాత, కొత్తకు మధ్య వారధిగా రచనలు చేసిన బాపిరాజు
- అడివి బాపిరాజు సాహిత్యంపై ఆచార్య డాక్టర్ మన్నవ సత్యనారాయణ



డాక్టర్ మన్నవ సత్యనారాయణను సత్కరించి బాపిరాజు చిత్రపటాన్ని బహూకరించిన నిర్వాహకులు

తెనాలి: ఆధునిక తెలుగు సాహిత్యంలో అడివి బాపిరాజు సాహిత్యం ప్రత్యేకమైందని ఆచార్య డాక్టర్ మన్నవ సత్యనారాయణ అన్నారు. వాకర్స్ క్లబ్, చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. పుట్టుకతో అంధుడైనా ఉన్నత విద్యను అభ్యసించి, అడివి బాపిరాజు సాహిత్యంపై పరిశోధన చేసి, డాక్టరేట్ సాధించిన యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ మన్నవ సత్యనారాయణ రచించిన 'అడివి బాపిరాజు సాహిత్యం–జీవితం' అంశంపై ప్రసంగించారు. 1880 తర్వాత సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించిందని చెబుతూ కథ, నవల, గేయం, నాటకం వంటి విభిన్న ప్రక్రియల్లో ఒక్కోదానిలో ఒక్కొక్కరు చక్కని రచనలు చేస్తూ గుర్తింపును తెచ్చుకున్నారని చెప్పారు. అయితే వీరందరికీ భిన్నంగా అడివి బాపిరాజు, అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ రచనలుచేసి తనను తాను సాటి అనిపించుకున్నారని డాక్టర్ మన్నవ చెప్పారు. 19వ శతాబ్దం ఆరంభంలో విదేశీ నాగరికత ప్రభావంతో ఏర్పడిన సంధియుగంలో సంప్రదాయ మనుగడకోసం విశ్వనాథ సత్యనారాయణ, సంప్రదాయంపై తిరుగుబాటు చేసి నూతనత్వం కోసం చలం తమ రచనలతో కృషిచేశారని గుర్తుచేశారు. అదే సమయంలో అటు సంప్రదాయాన్ని, ఇటు ఆధునికతను రెండింటికీ మధ్యేమార్గం అవలంబించారని తెలిపారు. కొత్త, పాతలకు మధ్య వారధిగా తన రచనలు సాగించటం బాపిరాజు ప్రత్యేకతగా వివరించారు. బాపిరాజు సాహిత్యంపై తన పరిశోధనలో ఆయన జీవితాన్ని కూడా తెలుసుకుని ఒక ప్రకరణంగా ఇవ్వటం తనకు ఆనందం కలిగించే విషయంగా చెప్పారు. డాక్టర్ మన్నవ సత్యనారాయణను రచయిత బి.లలితానంద ప్రసాద్ పరిచయం చేయగా, అడివి బాపిరాజు జీవిత విశేషాలను డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ వివరించారు. సంస్థ కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికారు.